పంచరత్నాలు

ఆసియా గేమ్స్‌లో భారత్‌కు మరో ఐదు పతకాలు

ఎనిమిదేండ్ల తర్వాత స్క్వాష్‌లో స్వర్ణం

సౌరవ్ ఘోషల్ నేతృత్వంలో బరిలోకి దిగిన భారత పురుషుల స్క్వాష్ జట్టు అద్భుత ప్రదర్శనతో పసిడి పతకం కైవసం చేసుకుంది. సౌరవ్, మహేశ్, అభయ్‌సింగ్‌తో కూడిన భారత జట్టు శనివారం ఫైనల్లో 2-1తో దాయాది పాకిస్థాన్‌ను చిత్తు చేసి అగ్ర స్థానంలో నిలిచింది. తొలి పోరులో మహేశ్ 0-3 (8-11, 3-11, 2-11)తో ఇక్బాల్ నసీర్ చేతిలో పరాజయం పాలవగా.. రెండో మ్యాచ్‌లో సౌరవ్ 3-0 (11-5, 11-1, 11-3)తో మహమ్మద్ ఆసిమ్‌పై ఏకపక్ష విజయం నమోదు చేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో పోరులో అభయ్ 3-2 (11-7, 9-11, 8-11, 11-9, 12-10)తో నూర్ జమాన్ పై గెలుపొందాడు. హోరాహోరీగా సాగిన మూడో మ్యాచ్‌లో అభయ్ తీవ్ర ఉత్కంఠ మధ్య కీలక పాయింట్లు నెగ్గడంతో స్క్వాష్‌లో భారత్‌కు ఎనిమిదేండ్ల (2014 ఇంచియాన్) తర్వాత పసిడి దక్కింది.

ఏడో రోజు 2 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యం

- బోపన్న-రుతుజ జోడీకి స్వర్ణం
- స్క్వాష్‌లో పసిడి వెలుగులు
- ఎయిర్ పిస్టల్‌లో రజతం
- 10 వేల మీటర్ల పరుగులో కార్తీక్‌కు వెండి
- గుల్వీర్ సింగ్ కంచు మోత

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	114	68	34	216
2	జపాన్	28	38	39	105
3	కొరియా	27	29	54	110
4	భారత్	10	14	14	38
5	ఉజ్బెకిస్థాన్	10	11	16	37
6	థాయ్‌లాండ్	8	4	14	26

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర- రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం

షెడ్యూల్

అథ్లెటిక్స్: మహిళల హెప్టాథ్లాన్ (నందిని, స్వప్న)-ఉ: 6.30
మహిళల 200మీ హీట్స్ (జ్యోతి)-ఉ: 7.00
పురుషుల 200మీ హీట్స్ (అమ్లాన్)- ఉ: 8.00
హాకీ: భారత్ X కొరియా (మహిళల)-మ:1.30
బ్యాడ్మింటన్: పురుషుల టీమ్‌ఫైనల్ (భారత్X చైనా)-మ: 2.30
బాక్సింగ్: మహిళల 50కి సెమీస్ (నిఖత్ జరీన్)-సా:4.30

వయసు పెరుగుతున్నా తన ఆటలో వన్నె తగ్గలేదని రోహన్ బోపన్న నిరూపించుకుంటే.. పడి లేవడం అంటే ఏంటో రుతూజా చేతల్లో చూపెట్టింది. ఫలితంగా టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం భారత్ ఖాతాలో చేరింది!

పెద్దగా అంచనాలు లేని స్క్వాష్ పురుషుల విభాగంలో భారత్ దుమ్మురేపగా..చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన మన కుర్రాళ్లు పసిడితో అదరగొట్టారు!

పక్షి కన్నుకు గురిపెట్టిన పార్థుడిలా.. మత్స్య యంత్రాన్ని ఛేదించిన అర్జునుడిలా.. మన షూటర్లు మరోమారు తడాఖా చూపారు.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్‌జ్యోత్-దివ్య జంట వెండి కాంతులు విరజిమ్మింది!

10 వేల మీటర్ల పరుగులో కార్తీక్ రజతం కైవసం చేసుకోగా.. గుల్వీర్ సింగ్ కంచు మోత మోగించాడు. ఫలితంగా ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల ఏడో రోజు భారత్ 5 పతకాలు ఖాతాలో వేసుకుంది. బ్యాడ్మింటన్ పురుషుల జట్టు తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లి చరిత్ర సృష్టించగా.. టేబుల్ టెన్నిస్ (టీటీ)లో సుతీర్థ-ఐహిక జంట ప్రపంచ చాంపియన్‌లకు షాకిచ్చి సెమీస్‌లో అడుగుపెట్టింది. బాక్సింగ్‌లో మరో మూడు పతకాలు ఖాయం కాగా.. వెయిట్ లిఫ్టింగ్ భారత స్టార్ మీరాబాయి చానుకు నిరాశ ఎదురైంది. పురుషుల హాకీలో దాయాది పాకిస్థాన్‌పై టీమ్‌ఇండియా రికార్డు విజయం నమోదు చేసుకుంటే.. అథ్లెటిక్స్‌లో తెలంగాణ యువకెరటం అగసర నందిని హీట్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. నేటి నుంచి ఆర్చరీ ఈవెంట్ ప్రారంభం కానుండగా.. అథ్లెటిక్స్ పోటీలు జోరందుకోనున్నాయి!

ప్రపంచ చాంపియన్‌లకు షాకిచ్చి..

టీటీ మహిళల డబుల్స్‌లో భారత యువ ప్లేయర్లు సుతీర్థ ముఖర్జీ-ఐహిక ముఖర్జీ చరిత్ర సృష్టించారు. సంచలన ఆట తీరుతో ప్రపంచ చాంపియన్‌లకు షాకిచ్చి సెమీఫైనల్లో అడుగుపెట్టారు. తద్వారా కనీసం కాంస్య పతకం ఖారురు చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్లో సుతీర్థ-ఐహిక జంట 3-1 (11-5, 11-5, 5-11, 11-9)తో ప్రపంచ రెండో ర్యాంక్ చైనీస్ ద్వయం మెంగ్ చెన్-యిడి వాంగ్‌పై ఘనవిజయం సాధించింది. ఆసియా క్రీడల మహిళల డబుల్స్‌లో భారత్‌కు ఇంతవరకు ఒక్క పతకం కూడా దక్కకపోగా.. తాజా ప్రదర్శనతో సుతీర్థ-ఐహిక ఆ ఘనత అందుకోనున్నారు.

రోహన్ రఫ్ఫాట..

ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలనే చందంగా.. భారత వెటరన్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్నా.. హాంగ్జౌలో సింహనాదం చేశాడు. పురుషుల డబుల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగి రిక్తహస్తాలతో వెనుదిరిగిన 43 ఏండ్ల రోహన్ బోపన్న.. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుతుజా భోంస్లేతో కలిసి పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. ఉత్కంఠ భరితంగా సాగిన తుది పోరులో బోపన్న-రుతుజా జోడీ 2-6, 6-3, 10-4తో సంగ్ హ్యాంగ్-షో లియాంగ్ (చైనా) ద్వయంపై విజయం సాధించింది. తొలి సెట్‌లో పరాజయం ఎదురైనా.. ఏమాత్రం స్థైర్యం కోల్పోకుండా భారత ప్లేయర్లు పోరాట పటిమ చూపారు. ఇటీవల డేవిస్ కప్‌లో భారత జట్టు నుంచి వీడ్కోలు పలికిన బోపన్న.. తన సర్వీస్‌లతో ఆకట్టుకుంటే.. రుతుజా రిటర్న్ షాట్లతో ప్రత్యర్థులను కంగు తినిపించింది. తాజా క్రీడల్లో టెన్నిస్‌లో భారత్‌కు ఇది రెండో పతకం కాగా.. ఈ శతాబ్దంలో ఇదే అత్యల్పం. 2002 (బుసాన్) క్రీడల్లో భారత్‌కు టెన్నిస్‌లో 4 మెడల్స్ రాగా.. 2006 (దోహా)లో నాలుగు, 2010 (గాంగ్జూ)లో ఐదు, 2014 (ఇంచియాన్)లో ఐదు, 2018 (జకార్తా)లో మూడు పతకాలు దక్కాయి. ఆసియా క్రీడల్లో బోపన్నకు ఇది రెండో స్వర్ణం కాగా.. 27 ఏండ్ల రుతుజా తొలిసారి పసిడి ముద్దాడింది.

దాయాది చిత్తు చిత్తు..

వరుస గోల్స్‌తో విజృంభించిన భారత పురుషుల హాకీ జట్టు.. పాకిస్థాన్‌పై అతిపెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది. పూల్-'ఎ'లో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 10-2తో పాక్‌ను పాతరేసి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. భారత్ తరపున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (11వ, 17వ, 33వ, 34వ నిమిషాల్లో) నాలుగు, వరుణ్ కుమార్ (41వ, 54వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా.. మన్‌దీప్ సింగ్ (8వ), సుమిత్ (30వ), శంషేర్ సింగ్ (46వ), లలిత్ కుమార్ ఉపాధ్యాయ్ (49వ) ఒక్కో గోల్ చేశారు. పాక్ తరపున మహమ్మద్ ఖాన్ (38వ), అబ్దుల్ రాణా (45వ) చెరో గోల్ కొట్టారు. ఇరు జట్ల మధ్య ఇది 180వ మ్యాచ్ కాగా.. భారత్‌కు గోల్స్ పరంగా (8) పాకిస్థాన్‌పై ఇదే అతిపెద్ద విజయం కావడం గమనార్హం. మ్యాచ్ ఆరంభం నుంచే భారత స్ట్రయికర్‌లు పాక్ గోల్‌పోస్ట్‌పై దండయాత్ర ప్రకటించారు.

రజతం, కాంస్యం మనవే

అథ్లెటిక్స్ పోటీల్లో మనవాళ్లు సత్తాచాటారు. శుక్రవారం మహిళల షాట్‌పుట్‌లో కాంస్యం దక్కగా.. శనివారం 10 వేల మీటర్ల రేసులో భారత అథ్లెట్లు రెండు పతకాలు ఖాతాలో వేసుకున్నారు. శనివారం జరిగిన 10 వేల మీటర్ల పరుగు పందెంలో కార్తీక్ కుమార్ 28 నిమిషాల 15.38 సెకండ్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలువగా.. గుల్వీర్ సింగ్ 28 నిమిషాల 17.21 సెకండ్లతో మూడో ప్లేస్‌తో కాంస్య పతకం ఖాతాలో వేసుకున్నాడు. కార్తీక్‌కు ఇదే కెరీర్ అత్యుత్తమ ప్రదర్శన కాగా.. చివరి వంద మీటర్లలో మన అథ్లెట్లు జోరు పెంచి పతకాలు పట్టారు. ఈ విభాగంలో బహ్రెయిన్ అథ్లెట్ బిర్హాను (28ని.13.62సె.) స్వర్ణం చేజిక్కించుకున్నాడు.

హాంగ్జౌ: 'ఇస్ బార్ సౌ పార్' అనే లక్ష్యంతో 19వ ఆసియా క్రీడల బరిలోకి దిగిన భారత అథ్లెట్లు.. అంచనాలకు మించి రాణిస్తున్నారు. చైనా వేదికగా జరుగుతున్న ఏషియన్ గేమ్స్ ఏడో రోజు శనివారం భారత అథ్లెట్లు 5 పతకాలు ఖాతాలో వేసుకున్నారు. టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న-రుతుజా భోంస్లే జంట పసిడి పతకం పట్టగా.. స్క్వాష్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో మనవాళ్లు స్వర్ణ సౌరభాలు విరజిమ్మారు. షూటింగ్‌లో సరబ్‌జ్యోత్ సింగ్-దివ్య జంట రజతం నెగ్గగా.. 10 వేల మీటర్ల పరుగులో కార్తీక్ కుమార్ వెండి, గుల్వీర్‌సింగ్ కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. దీంతో ఇప్పటి వరకు 38 మెడల్స్ (10 స్వర్ణాలు, 14 రజతాలు, 14 కాంస్యాలు) నెగ్గిన భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్నది. బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఆసియా క్రీడల్లో తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లి కొత్త చరిత్ర లిఖించింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 3-2తో దక్షిణ కొరియాను చిత్తుచేసింది. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, అర్జున్-ధ్రువ్ జోడీలు పరాజయం పాలైనా.. సింగిల్స్‌లో ప్రణయ్, లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్ దుమ్మురేపారు. ఇక అనధికారిక జాతీయ క్రీడ హాకీలో భారత్ విశ్వరూపం కనబర్చింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో పోరులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాలుగు గోల్స్‌తో శివతాండవమాడటంతో భారత్ 10-2తో జయభేరి మోగించి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. మహిళల 200 మీటర్ల హెప్టాథ్లాన్ బరిలో దిగిన తెలంగాణ యువ అథ్లెట్ అగసర నందిని 24.27 సెకన్లలో లక్ష్యాన్ని చేరి హీట్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది.

అయ్యో మీరా!

భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానుకు ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం పట్టి తనపై అంచనాలను అమాంతం పెంచేసిన చాను.. మహిళల 49 కేజీల విభాగంలో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ప్రాక్టీస్ సమయంలో తొడ కండరాలు పట్టేయడంతో పూర్తి స్థాయిలో సత్తా చాటలేకపోయిన చాను 191 కేజీలు (83 + 108) ఎత్తి పతకానికి దూరమైంది. క్లీన్ అండ్ జెర్క్‌లో 117 కేజీలు ఎత్తేందుకు రెండుసార్లు ప్రయత్నించి విఫలమైంది. మరోవైపు భారత బాక్సర్లకు శనివారం మూడు పతకాలు ఖాయమయ్యాయి. ప్రీతి పవార్ పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకుంది.

షూటింగ్‌లో 19వ పతకం

చైనా వేదికగా మన షూటర్ల ప్రతాపం కొనసాగుతున్నది. ఇప్పటికే తాజా క్రీడల్లో భారత షూటర్లు 18 పతకాలు సాధించగా.. శనివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జ్యోత్-దివ్య జోడీ రజత పతకం నెగ్గి ఆ సంఖ్యను 19కి పెంచింది. ఆసియా క్రీడల చరిత్రలో మన షూటర్లకు ఇదే అత్యధికం. ఫైనల్లో సరబ్‌జ్యోత్-దివ్య జంట 14-16తో ప్రపంచ చాంపియన్లు జాంగ్ బోవెన్-జియాంగ్ రెంగ్జిన్ ద్వయం చేతిలో పరాజయం పాలైంది. సరబ్‌జ్యోత్ ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం నెగ్గగా.. ఈ క్రీడల్లో అతడికిది రెండో మెడల్. ఇక హైదరాబాద్ స్టార్ షూటర్ కైనన్ చెనాయ్ పురుషుల వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో ఫైనల్‌కు అర్హత సాధించాడు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

పోటీలో 1200 మంది క్రీడాకారులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో శనివారం 9వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ టోర్నీలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు, 66 మంది కోచ్‌లు, 45 టెక్నికల్ ఆఫీషియల్స్ ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు, పురుషులు, మహిళలకు ఈ క్రీడలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు 20, 10వేల మీటర్ల రేస్‌వాక్, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్ త్రో, 100, 200 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రెండో రోజు ఆదివారం హర్డిల్స్, హ్యామర్‌త్రో, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అక్టోబర్ చివరి వారంలో వరంగల్‌లో జరిగే సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా అంతర్జాతీయ స్థాయి ఫోటో ఫినిష్ టెక్నాలజీని ఈ పోటీల నిర్వహణలో వినియోగిస్తున్నారు. ముగింపు కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ పాల్గొంటారు. పోటీలను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పర్యవేక్షిస్తున్నారు.

హెచ్‌సీఏ ఎన్నికల నగారా

- ఈ నెల 20న ఎలక్షన్స్
- నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో ఎన్నికల నగారా మోగింది. ఎప్పుడెప్పుడా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎన్నికలు రానే వచ్చాయి. ఎలక్టోరల్ అధికారి వీఎస్ సంపత్..హెచ్‌సీఏ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఈ నెల 20వ తేదీన ఎన్నికలు జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గుర్తింపు ఉన్న క్లబ్‌లు తమ ప్రతినిధులను మార్చుకునేందుకు ఈ నెల 7వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఈ నెల 11 నుంచి 13 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 14వ తేదీన స్క్రూటినీ జరుగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 16 ఆఖరి తేదీ కాగా అదే రోజు తుది జాబితాను ప్రకటించనున్నారు. దీనికి తోడు హెచ్‌సీఏకు అనుబంధంగా ఉన్న 149 క్లబ్‌లతో పాటు జిల్లాల అసోసియేషన్లు, మాజీ క్రికెటర్ల (పురుషులు, మహిళలు) జాబితాను వీఎస్ సంపత్ మీడియాకు విడుదల చేశారు. ఇదిలా ఉంటే హెచ్‌సీఏకు సెప్టెంబర్ 2019లో చివరి సారి ఎన్నికలు జరుగగా, మాజీ కెప్టెన్ అజారుదీన్ నేతృత్వంలో ప్యానెల్ కొలువుదీరింది. అయితే అజర్ అధ్యక్ష పదవీకాలం సెప్టెంబర్ 2020లోనే ముగిసింది. హెచ్‌సీఏలో నెలకొన్న అవినీతి ఆరోపణలు, బహుళ క్లబ్‌ల ప్రాతినిధ్యంపై సుప్రీం కోర్టు జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఆర్సీబీకి కొత్త కోచ్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ తొలి సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు అంచనాలను అందుకోలేకపోయింది. కెప్టెన్ స్మృతి మందానతో పాటు స్టార్ ప్లేయర్స్ విఫలమవ్వడంతో రెండంటే రెండే విజయాలు సాధించింది. దాంతో, వచ్చే సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కోసం ఇప్పటినుంచే ఆర్సీబీ యాజయాన్యం సన్నాహకాలు మొదలెట్టింది. మహిళల బిగ్‌బాష్ లీగ్ కోచ్‌గా విజయవంతమైన ల్యూక్ విలియమ్స్‌ను హెడ్‌కోచ్‌గా నియమించింది. ఐపీఎల్ 16వ సీజన్‌లో పురుషుల జట్టు ప్లే ఆఫ్స్ చేరకపోవడంతో కోచింగ్ సిబ్బందిని మార్చింది.

చాంపియన్ యువ భారత్

ఖాట్మాండు: దక్షిణాసియా అండర్-19 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ విజేతగా నిలిచింది. శనివారం ఇక్కడి దశరథ స్టేడియంలో జరిగిన ఫైనల్లో యువ భారత్ 3-0తో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. భారత్ తరపున మంగ్లేనాథాంగ్ కిప్‌జెన్ (64వ, 85వ నిమిషాల్లో) డబుల్ ధమాకా మోగించగా.. గొయారి (90+5వ ని.లో) ఒక గోల్ సాధించాడు. ఈ టోర్నీలో యువ భారత జట్టుకు ఇది ఎనిమిదో టైటిల్ కావడం విశేషం.

గోల్కొండ మాస్టర్స్ విజేత అమన్ రాజ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ పోటీల్లో అమన్‌రాజ్ విజేతగా నిలిచాడు. శనివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో పాట్నాకు చెందిన అమన్ టూ అండర్ 68తో గెలుపొందాడు. ఈ సీజన్‌లో అతడికి ఇది రెండో గోల్ఫ్ టైటిల్ కాగా మొత్తంగా కెరీర్‌లో మూడోది. దీంతో, అమన్ 18-అండర్ 262 పాయింట్లతో అగ్రస్థానానికి చేరాడు. ట్రోఫీతో పాటు రూ. కోటి నగదు బహుమతి సొంతం చేసుకున్నాడు. మానసికంగా దృఢంగా ఉండడం వల్లనే ఈ ఏడాది రెంటు టైటిళ్లు సాధించానని, ఈరోజు మాత్రం ఒక్కో షాట్‌పైనే దృష్టి పెట్టి ఫలితం సాధించానని అమన్ తెలిపాడు. మైసూర్‌కు చెందిన యశస్ చంద్ర (63-67-68-65) 65 పాయింట్లతో 17 అండర్ 263తో రన్నరప్‌గా నిలిచాడు.

పాలమూరులో ఇండోర్ స్టేడియం

ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అధునాతన సౌకర్యాలతో మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చింది. శనివారం క్రీడా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్టేడియాన్ని ప్రారంభించారు. ప్రధాన స్టేడియం ఆవరణలో రూ.9.10 కోట్లతో ఈ మల్టిపర్పస్ స్టేడియాన్ని ప్రభుత్వం నిర్మించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ప్రతి నియోజకవర్గంలో స్టేడియాలు, ప్రతి పల్లెలో క్రీడాప్రాంగణాలు నిర్మించాం. గతంలో పాలమూరులో పేరుకే స్టేడియం ఉండేది. కానీ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా 50 కోట్లతో ప్రధాన స్టేడియం ఆధునీకరణతో పాటు మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఇండోర్ స్టేడియం నిర్మించాం. దేశంలో ఎక్కడా లేని స్టేడియాలను నిర్మిస్తున్నాం. వాలీబాల్ అకాడమీని ఇక్కడికి తీసుకొచ్చాం, త్వరలో సింథటిక్ ట్రాక్ నిర్మిస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ షట్లర్ గుత్తా జ్వాల, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

వర్షార్పణం

భారత్, ఇంగ్లండ్ వార్మప్ మ్యాచ్ రద్దు

గువాహటి: వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లను వర్షం నీడలా వెంటాడుతున్నది. ఈ నెల 5 నుంచి మెగా టోర్నీ ప్రారంభం కానుండగా.. శనివారం భారత్, ఇంగ్లండ్ మధ్య జరగాల్సిన వార్మప్ పోరు భారీ వర్షంతో రద్దైంది. వరుణుడి ప్రభావంతో మ్యాచ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమయ్యేలా కనిపించగా.. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ దశలో వర్షం దంచికొట్టింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం వరుణుడు ఎంతకూ శాంతించకపోవడంతో నిర్వాహకులు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వర్షం కారణంగా శుక్రవారం దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్ మధ్య మ్యాచ్ కూడా రద్దు కాగా.. శనివారం ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ పోరుకు కూడా వరుణుడు ఆటంకం కలిగించాడు. దీంతో మ్యాచ్‌ను 23 ఓవర్లకు కుదించగా.. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్ (55) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అనంతరం లక్ష్యఛేదనలో నెదర్లాండ్స్ 14.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. ఈ దశలో మరోమారు మ్యాచ్‌కు వర్షం అడ్డుపడింది. వార్మప్ మ్యాచ్‌ల్లో భాగంగా మంగళవారం తిరువనంతపురం వేదికగా నెదర్లాండ్స్‌తో టీమ్‌ఇండియా తలపడనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.